

అమర్‌నాథ్ కుటుంబానికి ఆర్థిక సాయం

గతేడాది వైసీపీ కార్యకర్త చేతిలో సజీవ దహనమైన చెరుకుపల్లికి చెందిన బాలుడు అమర్నాథ్‌గౌడ్ కుటుంబసభ్యులను భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రలో భాగంగా మంగళవారం పరామర్శించారు. బాలుడి సోదరి హేమశ్రీకి ఎన్నారై స్వచ్ఛంద సంస్థ జొన్నలగడ్డ వీరయ్యచౌదరి, జొన్నలగడ్డ వేణు, దివ్య మద్దునూరి మిత్రబృందం సమకూర్చిన రూ.4 లక్షల 50 వేల చెక్కును, యూఎస్ఏకు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సేకరించిన రూ.3 లక్షల 58 వేల చెక్కును అందజేశారు. కళాశాలలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదువుకుంటున్న హేమశ్రీని అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో హేమశ్రీ కన్నీటి పర్యంతమవగా దగ్గరకు తీసుకుని కలత చెందాల్సిన అవసరం లేదని, ఉన్నతస్థాయి ఉద్యోగం వచ్చే వరకు కుటుంబానికి అండగా ఉంటామని భువనేశ్వరి భరోసా ఇచ్చారు.

చదువుకు అండగా..

గతేడాది సెప్టెంబరు 10న చంద్రబాబు అరెస్టు వార్తలను టీవీలో చూస్తూ గుండెపోటుతో యద్దనపూడి గ్రామానికి చెందిన టెక్కెం నాగేశ్వరరావు మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె వివాహం అవ్వగా, చిన్న కుమార్తె డిగ్రీ పూర్తి చేశారు. సివిల్స్‌కు వెళ్లాలన్న తన కోరికను తండ్రి మరణించడంతో విరమించుకోగా, ప్రస్తుతం భువనేశ్వరి ఆమె చదువుకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థికసాయం అంద జేశారు.



యద్దనపూడిలో టెక్కం నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

మొవ్వ సింగారావు కుటుంబానికి..

చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన మొవ్వ సింగారావు గతేడాది అక్టోబరు 12న మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన సంపాదన మీదే ఆధారపడి ఆ కుటుంబం బతుకుతోంది. ఈ క్రమంలో భువనేశ్వరి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి రూ.3 లక్షలు అందజేశారు.

కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..

కుటుంబ సభ్యుడ్ని కోల్పోయిన మీరు ఎంత బాధలో ఉన్నారో తెలుసు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం.. టీడీపీ కార్యకర్తలంతా మా కుటుంబ సభ్యులే.. ఏ కష్టమొచ్చిన పార్టీ అండగా ఉంటుంది.. ఏ సమయంలో అయినా మా దగ్గరికి రావచ్చు.. అంటూ చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ధైర్యం చెప్పారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో గతంలో మృతి చెందిన బాధిత కుటుంబాల కష్టాలు వింటూ.. వారి కన్నీళ్లు తుడిచారు. కుటుంబసభ్యుడ్ని కోల్పోయి నీరింకిన కళ్లతో ఉన్న బాధిత కుటుంబాలకు నిజం గెలవాలి యాత్ర ద్వారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. రేపల్లె, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో భువనేశ్వరి పర్యటన మంగళవారం జరిగింది. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబాలకు భువనేశ్వరి ఆర్థిక సాయం అందజేశారు. చంద్రబాబు అరెస్టుతో జిల్లాలో చనిపోయిన ముగ్గురూ నిరుపేదలే కావడం, కుటుంబ భారం మోసే వారే తనువుచాలించడంపై ఆమె చలించిపోయారు.

- అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా
- నిజం గెలవాలి యాత్రలో భువనేశ్వరి పరామర్శ
- రేపల్లె, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో పర్యటన

రేపల్లె, చెరుకుపల్లి / బాపట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ప్రాణాలొదిలిన మూడు కుటుంబాలను మంగళవారం భువనేశ్వరి పరామర్శించారు. వారికి ధైర్యాన్ని నింపడంతో పాటు ఆర్థికంగా సాయం అందించడానికి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి జిల్లాలో పర్యటించారు. చెరుకుపల్లిలో ఒకరు, పర్చూరు నియోజకవర్గం చిననందిపాడు, యద్దనపూడి గ్రామాల్లో ఒక్కొక్కరు గుండెపోటుతో గతేడాది మృతి చెందగా వారి కుటుంబాలకు భువనేశ్వరి ఆత్మీయ పరామర్శ మనోధైర్యాన్ని ఇచ్చింది. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆమె బాధిత కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. చంద్రబాబుపై ఉన్న అభిమానంతో ఆయన అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటు వచ్చి మరణించారని వారి కుటుంబసభ్యులు భువనేశ్వరి ఎదుట కన్నీటి పర్యంతమవగా అండగా ఉంటానని వారి భుజం తట్టి ధైర్యం చెప్పారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా చెరుకుపల్లిలో తోట వెంకటేశ్వరరావు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించా రు. అనంతరం రూ.3 లక్షల చెక్కును వెంకటేశ్వరరావు భార్య విజయలక్ష్మికి అం దజేశారు. భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్న వెంకటేశ్వరరావు కుమారులు సురేష్, రాజేష్ ఎలాంటి ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

నిజం గెలవాలి యాత్ర సాగిందిలా..

గన్నవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో నిజం గెలవాలి యాత్ర సాగింది. భువనేశ్వరికి జిల్లా ప్రారంభంలో కార్యకర్తలు ఆహ్వానం పలికారు. చిలుమూరు కర కట్ట పై ఉన్న ఆంజనేయస్వామికి భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. కొల్లిపర మండలం పిడపర్తిపాలెం మహిళలు భువనేశ్వరి వాహన శ్రేణికి ఘనంగా స్వాగతం పలికారు. భువనేశ్వరికి హారతులు ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం చెరుకుపల్లిలోని బాధిత కుటుంబం ఇంటి వద్దకు చేరుకుని వారిని పరామర్శించారు. వెల్లటూరులో మహిళలు అభ్యర్థన మేరకు వాహనం నుంచి బయటకు వచ్చి భువనేశ్వరి అభివాదం చేశారు. దారి పొడవునా మహిళలు ఆమెను చూసేందుకు బారులు తీరారు. చెరుకుపల్లిలో అయితే అపూర్వ స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి వెంట మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ బాపట్ల, చీరాల ఇన్‌చార్జులు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య, టీడీపీ చెరుకుపల్లి మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఉప్పాల సాంబశివరావు, పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో తోట వెంకటేశ్వరరావు భార్య విజయలక్ష్మికి చెక్కును అందిస్తున్న భువనేశ్వరి, ప్రక్కన ఎమ్మెల్యే అనగాని



కొల్లూరులో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి ఆనందబాబు



చెరుకుపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి, ఎమ్మెల్యే అనగాని

చేయూత ఏరివేత



- లబ్ధిదారుల తగ్గింపునకు అడ్డదారులు
- కరెంటు బిల్లుల పేరుతో అడ్డగోలుగా కోతలు
- 300 యూనిట్లు దాటించేందుకు పిల్లిమొగ్గలు
- సెప్టెంబరు నుంచి ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం

మంగళగిరికి చెందిన ఓ మహిళకు వలంటీర్ ఫోన్ చేసి మీకు చేయూత ఆగిపోయిందండీ అని చెప్పిం ది. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటడమే కారణ మని చెప్పింది. ఏమిటా అని సచివాలయంలో అడిగితే ఆమె హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో రెండు మీటర్లు చూపిస్తున్నాయని చెప్పారు. ఆ రెండు మీటర్లు కలుపుకున్నా ఆమె కరెంటు బిల్లు 290 యూనిట్లు దాటలేదు. కానీ ప్రభుత్వం మాత్రం 310 యూనిట్లు వచ్చిందని చెప్పి ఆమెకు చేయూత ఆపేశారు. ఏమిటా అని లోతుగా పరిశీలిస్తే ఒక ఏడాదిలో 300 యూనిట్లు దాటిని నెలల సగటు తీసుకుని ఆమె చేయూత ఆపేశారని తేలింది.

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను అంతకంతకూ నీరుగార్చడం ధ్యేయంగా ప్రభుత్వం ఏటికేడు మార్పులు, నిబంధనలను కఠినతరం చేస్తోంది. ముందు ఏదో ఒక సాకుతో లబ్ధిదారులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇదేదో ఒక పథకానికి పరిమితా అంటే కాదు. అన్ని పథకాల పరిస్థితి ఇలానే ఉంది. ఈ కోవలోకి చేయూత చేరింది. ఏదో ఒకలా లబ్ధిదారులను తొలగిస్తే ఆ తర్వాత వారి ఖర్మం అన్నట్లుగా ప్రభుత్వ తీరు ఉందన్న విమర్శలున్నా పాలకులు లెక్క చేయడంలేదు. ఇప్పటికే సంక్షేమ పథకాలకు సవాలక్ష నిబంధనలు పెట్టి లబ్ధిదారులను ఎక్కడికక్కడ దిగ్గోసినా ప్రభుత్వానికి తృప్తి కలిగినట్లుగా లేదు. తప్పుడు పద్ధతుల్లో ఆ నిబంధనలను అన్వయించి లబ్ధిదారులను భారీగా తగ్గించేపనిలో తలమునకలై ఉంది.

నిబంధనలు ఇలా.. అమలు ఇలా..

చేయూత అమలుకు ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటరాదు. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. ఐటీ చెల్లింపులు చేసి ఉండకూడదు. ఇంట్లో ప్రభుత్వ పింఛను తీసుకునేవారు ఉండకూడదు. ఇంటి స్థలం, పొలం నిర్ణీత విస్తీర్ణాన్ని మించి ఉండకూడదు అంటూ ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. వాటిని అమలు చేసిన కారణంగా గత మూడు దఫాల్లోనే చాలామంది చేయూత పథకానికి అనర్హులుగా మారిపోయారు. ఈసారి లబ్ధిదారులను ఏరివేసేందుకు అవకాశం దొరకలేదు. దీంతో అడ్డదారుల్లో నిబంధనలను అన్వయించి లబ్ధిదారులను మోసం చేస్తోంది. ఆరునెలల విద్యుత్ వినియోగ సగటు 300 యూనిట్లు దాటరాదన్న నిబంధనను తప్పుడు దారిలో అన్వయిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఆరు నెలల సగటు కాకుండా, మొత్తం విద్యుత్ వినియోగంలో అత్యధికంగా విద్యుత్ వినియోగించిన నెలలు ఎంచుకుని ఆ సగటును చూపించి లబ్ధిదారులను తొలగిస్తోంది. గతంలో ఏనాడో కారు కొని ఉండి అది ఇప్పుడు అమ్ముకుని ఉన్నా, కారు లేదన్న విషయాన్ని పక్కకు పెట్టి లబ్ధిదారులను తొలగిస్తున్నారు. ఐటీ విషయంలో కూడా ఇదే జరుగుతోంది. గృహరుణం కోసం గతంలో ఏనాడో చెల్లించిన ఐటీ చెల్లింపులు, ఐటీ కట్టినవారు రేషన్ కార్డులో ఉన్నారనే కారణంతో చాలా మందికి చేయూత ఆపేశారు. చేయూత లబ్ధి పొందే మహిళ సోదరుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడనో, తండ్రి విశ్రాంత ఉద్యోగ పింఛను తీసుకుంటున్నాడనో, ఐటీ చెల్లించాడనో పెళ్లై వేరే కుటుంబంలోకి వెళ్లిపోయిన మహిళలకు కూడా పింఛను తొలగిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి.



ఫిబ్రవరి వచ్చినా ఊసేలేని పథకం

ఆది నుంచి చేయూత పథకాన్ని ప్రభుత్వం జాప్యం చేస్తూనే వస్తోంది. 2019 జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పేరుతో హడావుడి చేసింది. అయితే 2020 ఆగస్టు 12 వరకూ ఆ పథకం ఊసే ఎత్తలేదు. అధికారం చేపట్టిన 14 నెలల వరకూ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించలేదు. 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం 2022 సెప్టెంబరు 23 వరకూ మూడో దఫా చేయూత అందించలేదు. అంటే 2021 తర్వాత మరో 16 నెలలకుగానీ లబ్ధిదారులకు చేయూత దక్కలేదు. కాగా కిందటేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తలేదు. అక్టోబరులో ఇస్తారన్న చేయూత, జనవరిలో కూడా ఇవ్వలేదు. తాజాగా ఫిబ్రవరి అంటున్నారు. అదైనా అమలవుతుందో లేదో తెలియని పరిస్థితి. ఎన్నికల కోడ్ సమీపిస్తోన్న నేపథ్యంలో ప్రభుత్వమే కావాలని జాప్యం చేస్తోందా అన్న అనుమానాలు లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

ఒక సారి ఆగిపోతే ఇక అంతే..

ప్రభుత్వం ఏదో ఒక మెలిక పెట్టి ఒకసారి పథకానికి అనర్హులుగా చేస్తే ఇక వారికి పథకం అందడం దాదాపు అసాధ్యమే! తమ వద్ద ఆధారాలు ఉన్నా, ఎంపిక విధానంలో లోపమున్నా లబ్ధిదారులు చేయగలిగిందేమీ లేదు. కావాలంటే సచివాలయానికి వెళ్లి ఆధారాలతో ఒక అభ్యర్థన పెట్టుకోవచ్చు. కానీ దాన్ని పరిశీలించి పరిష్కరించే అధికారం, అవకాశం ఏ ఒక్కరికీ లేదు. క్షేత్ర స్థాయిలో ఉండే గ్రామ, వార్డు సంక్షేమ అధికారి మొదలు, ఎంపీడీవో, డీఆర్‌డీఏ పీడీ వరకూ ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో అనర్హత బారిన పడిన లబ్ధిదారుల గోడు వినేవారే లేకుండా పోయారు.

పైసలిస్తేనే.. బిల్లులు



- అడిగినంత ఇవ్వకుంటే పెండింగ్
- జీతాల బిల్లులకూ సమర్పించాల్సిందే
- ట్రెజరీలో ప్రతినెలా ఉద్యోగులకు చుక్కలే
- జిల్లా ఖజానా కార్యాలయంలో లంచావతారాలు

గుంటూరు సిటీ, జనవరి 30: అవినీతికి.. ప్రభుత్వ ఉద్యోగులు కూడా బాధితులే. సాధారణంగా తమ వద్దకు ఏదైనా పనిపై వచ్చే సామాన్య ప్రజలు మామూళ్లు సమర్పించనిదే ఉద్యోగులు పని చేయరు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ జీతాల బిల్లుల కోసం మామూళ్లు సమర్పించాల్సి రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కాని గుంటూరు ఖజానా కార్యాలయంలో ఈ పరిస్థితి ఉందని ప్రభుత్వ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గత నెలలో ఒకేసారి 90 బిల్లులు ఉన్నత అధికారి ఒత్తిడితో పాస్ చేశారంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గుంటూరు జిల్లా ఖజానా కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోందంటున్నారు. అడిగినంత ముట్టజెప్పకుంటే ఇక్కడ బిల్లు పాసవ్వడం లేదు. ఫలితంగా ఉద్యోగుల జీతాల బిల్లులు సైతం నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రస్తుతం జిల్లా ఖజానా కార్యాలయంలో ఒక్కో బిల్లు పాస్ చెయ్యడానికి కనీసం రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్, ఇతర ప్రభుత్వ శాఖ ఉద్యోగులు ఖజానా అధికారుల వేధింపులకు విసిగివేసారుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా జీతాల బిల్లులకు మామూళ్లు ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్, గ్రామ సచివాలయాల్లో ఆరు వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో మరో ఐదు వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వీరు కాక మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు మండలాల ఉద్యోగుల జీతాల బిల్లులు కూడా జిల్లా ఖజానా కార్యాలయం నుంచే సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టమ్)కి వెళ్తాయి. సదరు జీతాల బిల్లులు ఆయా డ్రాయింగ్ అధికారుల(డీడీ) నుంచి ఖజానా కార్యాలయానికి చేరుతాయి. వాటిని ఖజానా అధికారులు పరిశీలించి విధిగా సీఎఫ్ఎంఎస్‌కి పంపాలి.

ఇరవై రోజులైనా అతీగతి ఉండదు

నగర పరిధిలోని డీడీల నుంచి ఉద్యోగుల జీతాల బిల్లులు సకాలంలోనే జిల్లా ఖజానా కార్యాలయానికి చేరుతున్నాయి. అక్కడ నుంచి వచ్చిన బిల్లులకు ఖజానా కార్యాలయంలో బ్రేక్ లు పడుతున్నాయి. ఏ విధమైన కారణం లేకుండానే ఒక్కోసారి ఇరవై రోజులకు పైబడి బిల్లులు పాస్ చేయడం లేదు. సరైన సమయంలో వచ్చిన బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. సుమారు 5 నెలలుగా జీతాలు అందని ఉద్యోగులు కూడా ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 10న వచ్చిన సుమారు 90 బిల్లులు మంగళవారం వరకు పాస్ కాలేదు. వాటిని కావాలనే ఆపినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.


లీకులు అనంతం

- తరచూ మరమ్మతులతో సరి
- సమాచారం లేకుండానే సరఫరా బంద్
- తాగునీరు రాక అల్లాడుతున్న నగరవాసులు



పొన్నూరు రోడ్డులో మంగళవారం సాయంత్రం కూడా కొనసాగుతున్న పైపులైను పనులు

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు పంపింగ్ మెయిన్ పైపులైను లీకుల మరమ్మతులను అరికట్టలేకపోతున్నారు. లీకులను సకాలంలో అరికట్టామని ప్రకటనలు చేయడం, ఆ తర్వాత కొద్ది రోజులకే మళ్లీ లీకేజీలు ఏర్పడ్డాయని నీటి సరఫరాని నిలిపేయడం షరామామూలుగా మారింది. తాజాగా బీఆర్ స్టేడియం ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద పంపింగ్ మెయిన్ పైపులైనుపై ఏర్పడిన లీకులు అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ కారణంగా సోమవారం రాత్రి నుంచే బీఆర్ స్టేడియం, ఐపీడీ కాలనీ, నల్లచెరువు, శ్రీనివాసరావుపేట, కేవీపీ కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంకుల పరిధిలోని ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిపేశారు. ఏ కారణం చేతనైనా బీఆర్ స్టేడియం పైపులైనుకు లీకులు ఏర్పడితే మిగతా ప్రాంతాలన్నింటికి నీటి సరఫరా నిలిపేయాల్సి ఉంటుంది. కీలకమైన స్టేడియం పంపింగ్ మెయిన్ పైపులైను నిర్మాణం జరిగి దశాబ్దాలు కావడంతో ఎక్కడికక్కడ లీకులు పడి తరచుగా నీటిసరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. గత వారం పొన్నూరు రోడ్డులో కొంతభాగం పైపులైనుని ఎంఎస్ పైపులతో మార్చారు. ఆ సందర్భంలో కంట్రోలింగ్ వాల్వుని సక్రమంగా అమర్చలేకపోయారు. అప్పటికే రెండు రోజులు బ్రేక్‌డౌన్ తీసుకుని మరో రోజు పొడిగించాల్సి వచ్చింది. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని పైపులైను లీకుల పనులను నిలిపేసి నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ఆ లీకులు జరిగిన తర్వాత నుంచి పాక్షికంగానే నీటి సరఫరా జరుగుతుందని వివిధ ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. కాగా ఎక్కడైతే గత వారంలో పైపులైను లీకులు పనులు చేశారో వాటికి పక్కనే మరో రెండు చోట్ల భారీ లీకేజీలు బయటపడి నల్లచెరువు, ఐపీడీ కాలనీ, శ్రీనివాసరావుపేట, కేవీపీ కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీళ్లు ఎక్కడం లేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు సోమవారం రాత్రి నుంచి నీటి సరఫరా నిలిపేసి పనులు చేపట్టారు. వాల్వు పనులను పూర్తి చేశారు. దీనికి సమీపంలోనే మరో లీకు ఉండగా దానిని అరికట్టేందుకు ఒక క్లాంపును అమర్చి సిమెంట్ పూశారు. అయితే అది ఎంతమేరకు నిలుస్తుందో చెప్పలేని పరిస్థితి. బుధవారం ఉదయం కూడా చాలా చోట్ల నీటి సరఫరా జరగదని అధికారులు తెలిపారు. గతంలోనూ పైపులైన్ల లీకుల రిపేర్ల పేరుతో వారం పాటు తాగునీటి సరఫరా బంద్ చేసిన చరిత్ర ఇంజనీర్లకు ఉన్నది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండకపోతే లీకులు వారి మెడకు చుట్టుకునే ప్రమాదం పొంచి ఉన్నది.





వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

సాగు చేసుకోలేక భూములివ్వలేదు

- ప్రభుత్వం అడిగితే రాష్ట్ర రాజధాని కోసం ఇచ్చాం
- మూడు ముక్కల ఆటతో నట్టేట ముంచాలని చూస్తే మట్టి కొట్టుకుపోవటమే
- 1505వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 30: సాగు చేసుకోలేక మూడు పంటలు పండే భూములివ్వలేదని, ప్రభుత్వం రాష్ట్ర రాజధాని కోసం అడిగితే 33వేల ఎకరాలు ఇచ్చామని రాజధాని అమరావతి రైతులు పేర్కొన్నారు. మూడు రాజధానుల మూడు ముక్కల ఆటతో నట్టేట ముంచాలని చూస్తే పాలకులు మట్టి కొట్టుకుపోతారన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1505వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ, ప్రభుత్వం మారినంత మాత్రాన చట్ట ప్రకారం చేసుకున్న ఒప్పందాలు రద్దు కావన్నారు. హైకోర్టు కూడా అమరావతిని అభివృద్ధి చేయాలనే చెప్పిందన్నారు. కానీ సీఎం జగన్‌రెడ్డి చట్టాలను అమలుచేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేయాలన్నారు. సీఎం జగన్‌రెడ్డి సొంత ప్రయోజనాల కోసం విశాఖ రాజధాని అంటున్నాడన్నారు. రాజ్యాంగంలో లేని మూడు రాజధానులు ఏపీలో రుద్దటం అవివేకమన్నారు. రాష్ట్ర సంపద అమరావతిని కాపాడుకుంటామన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

మహోన్నత వ్యక్తి గౌతు లచ్చన్న

- ఎమ్మెల్యే సత్యప్రసాద్



బలిజేపల్లిలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్, మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, జనవరి 30: మహోన్నత వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ అని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కొనియాడారు. మంగళవారం రాత్రి బాపట్ల జిల్లా వేమూరు మండలంలోని బలిజేపల్లిలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ జరిగిన సభకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. సభలో సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుండి ఎగసిపడిన రాజకీయ కెరటం లచ్చన్న అన్నారు. జీవితాంతం బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మద్రాసు రాష్ట్రం నుండి రావలసిన ఆస్థుల పంపకాలను పరిశీలించిన సభ్యుల్లో ఒకరుగా లచ్చన్న ఉండడం ఆంధ్రులైన మనందరం గర్వించదగ్గ విషయం అన్నారు. జైలు జీవితం, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలలో చురుకైన పాత్ర, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా నడిపిన ఉద్యమాలు ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయనను మహనీయుడిగా నిలబెట్టాయన్నారు. గ్రామంలో లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ చూపిన కోగంటి బాలగంగాధర్(విశ్వం)ను సత్యప్రసాద్, ఆనందబాబులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, ఆ పార్టీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి సోమరౌతు అనురాధ, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు, టీడీపీ నాయకులు డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దొప్పలపూడి సుధాకర్, మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ టీడీపీ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు సాంబశివరావు, దొప్పలపూడి రవి, పార్టీ నాయకులు అమర్తలూరు చింతయ్య, గౌడ సంఘం నాయకులు, టీడీపీ, జనసేన పార్టీల వివిధ విభాగాల శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పార్టీల శ్రేణులు అతిధులకు బైక్ ర్యాలీ ద్వారా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం చేశారు.

హోమ్ ఓటింగ్ విధానంపై అవగాహన పెంచాలి

- రాష్ట్ర ఈవీఎం కేంద్రాల నోడల్ అధికారి హరేంద్రనాథ్



బాపట్ల మార్కెట్‌యార్డులో ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న రాష్ట్ర ఈవీఎం కేంద్రాల నోడల్ అధికారి హరేంద్రనాథ్, కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 30: హోమ్ ఓటింగ్ విధానం త్వరలో అమలులోకి రానుందని, ఈ విధానం అమలుపై అధికారులు జాగ్రత్త వహించాలని ఎన్నికల కమిషన్ అదనపు సీఈవో, రాష్ట్ర ఈవీఎం కేంద్రాల నోడల్ అధికారి హరేంద్రనాథ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై జిల్లాస్థాయి నోడల్ అధికారుల శిక్షణా కార్యక్రమం మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌లో జరిగింది. తదుపరి ఈవీఎం గోదాంల భద్రత, సీసీకెమెరాల పనితీరు, సంబంధిత దస్త్రాల నిర్వహణను కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన విధానంపై ఓటర్లకు విస్తృత అవగాన కలిగించాలని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సమస్యలు ఉత్పన్నం కాకుండా నోడల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణలో తప్పులు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా స్పష్టం చేశారు. ఎన్నికల కంట్రోల్ రూమ్, వెబ్‌సైట్‌ల నిర్వాహణపై అవగాహన ఉండాలన్నారు సమావేశంలో అడిషనల్ ఎస్పీ పీ మహేష్, డీఆర్‌వో పీ వెంకటరమణ, ఆర్డీవో గంధం రవీందర్, డ్వామా పీడీ డాక్టర్ బీ అర్జునరావు, ఏవో కే గోపికృష్ణ, ఎన్నికల విభాగ పర్యవేక్షకులు కృష్ణకాంత్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలి

- జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ మనోహర్

కొల్లిపర, జనవరి 30: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం కొల్లిపరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదం వలన సుమారు రూ.80కోట్ల నుంచి రూ.100కోట్ల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తుందన్నారు. నష్టపోయిన రైతుల పక్షాన జనసేన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు పసుపును నిల్వ పెట్టుకునేందుకు ఏ మండలానికి ఆ మండలంలో కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో కొల్లిపర మండలంలో అనేక కార్యక్రమాల్లో విస్తృతంగా పర్యటించనున్నట్లు తెలిపారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా మంచి ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, నాయకులు భీమవరపు కిశోర్‌రెడ్డి, పెరికల రాంబాబు, బొంతు హరికృష్ణ, నీలం పూర్ణ, పసుపులేటి మురళికృష్ణ, బండారు రవికాంత్, దివ్వెల మధుబాబు, గుంటూరు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో అగ్ని ప్రమాదం

- 250 క్వింటాళ్ళ గుడ్డి పత్తి దగ్ధం
- రూ 18 లక్షల నష్టం



తగలబడుతున్న పత్తి గోడౌన్

క్రోసూరు, జనవరి 30: క్రోసూరులో కూరపాటి సైదాకు చెందిన పత్తి గోడౌన్ మంగళవారం అగ్ని ప్రమాదానికి గురైంది. గోడౌన్‌లో ఉన్న 250 క్వింటాళ్ళ గుడ్డి పత్తి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. నష్టం రూ.18లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలియ జేశారు. కూరపాటి సైదా గుడ్డి పత్తి, పాత ఇనుము వ్యాపారం చేస్తూ ఉంటాడు. క్రోసూరు సెంటర్‌లో తన ఖాళీ స్థలంలో పత్తితో పాటు పాత ఇనుప సామాన్లను కూడా నిల్వ చేశాడు. ఈ క్రమంలో హఠాత్తుగా మంటలు చెలరేగి పత్తి గోడౌన్‌తో పాటు ఇతర సామాన్లు కూడా దగ్ధమయ్యాయి. కూరపాటి సైదాకు చెందిన నివాస గృహం కూడా పాక్షికంగా దెబ్బతిన్నది. స్థానికంగా ఓ వ్యక్తి అంతిమయాత్ర సందర్భంగా బాణసంచా కాల్చటంతో తారా జువ్వ గోడౌన్‌పై పడిందని కొందరు, షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని మరి కొందరు కారణాలుగా చెపుతున్నారు. క్రోసూరు, సత్తెనపల్లి కేంద్రాలకు చెందిన అగ్నిమాపక శకటాలు మంటలను ఆర్పివేశాయి. క్రోసూరు నడిబొడ్డున అగ్ని ప్రమాదం సంభవించటంతో చుట్టుపక్కల షాపులవారు, గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించటం వల్ల ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. రెవెన్యూ అధికారులు సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), జనవరి 30: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ నందు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ కె.పద్మజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉన్న 21 సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లో ప్రవేశంకోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 23లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2011 నుంచి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్ బీసీ-సీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలని సూచించారు. సంబంధిత జిల్లాలో విద్యార్థులు 3వ తరగతి, 4వ తరగతి 2023-24 సంవత్సరాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో పూర్తిచేసి ఉండాలి. అదేవిధంగా తండ్రి, సంరక్షకుని సంవత్సర ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుకోసం https://apbra gcet. apcfss.in అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని జిల్లా కో ఆర్డినేటర్ సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పుతో వైసీపీ నాయకులు సిగ్గుపడాలి

పెదకూరపాడు, జనవరి 30: సుప్రీంకోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టు అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురు దెబ్బతగిలిందన్నారు. చంద్రబాబుకు ముందస్తు బెయిల్ రద్దుచేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టినవి తప్పుడు కేసులని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గు పడాలన్నారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడు తూ ప్రజాధనాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంఎల్‌సీలు పార్టీని వీడుతున్నారని, పార్టీలో జగన్ తన ఆధిపత్యాన్ని కాపాడుకోవటానికి ఎమ్మెల్యేలను, ఎంఎల్‌సీలను పావులుగా వాడుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని, అధికారంలోకి వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనన్నారు.

అధికార పార్టీ, పోలీసుల వేధింపులతోనే
దుర్గారావు ఆత్మహత్య

- మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అర్జున

విజయపురిసౌత్, జనవరి 30: అధికారపార్టీ, పోలీసుల వేధింపులతోనే వెల్దుర్తి మండలంలో మత్స్యకారుడు దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నాడని మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడితి అర్జున అన్నారు. మంగళవారం మండలంలోని విజయపురిసౌత్‌లో దుర్గారావు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి మాట్లాడారు. చేపల వేటతో జీవించే నిరుపేద కుటుంబాలపై కేసులు పెట్టి వేధించడం దారుణమన్నారు. దుర్గారావు మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మృతుని కుటుంబసభ్యులను ఫోన్లో పరామర్శించారు. కార్యక్రమంలో రమేష్, కొప్పుల రవీంద్ర, రామ్ ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, సింహాచలం, నేరేటి వీరాస్వామి యాదవ్, వజ్రం నాయక్, గుండాల శ్రీను, జనసేన అధ్యక్షుడు రాహుల్, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, ఆడెపు కోటయ్య, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్జున

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,30,851 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,25,366 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయమార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 72,581 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	14000	14000
334	9500	20000	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు.5	12000	20000	తేజ	8000	20500
273	12500	15500	బ్యాడిగి	9500	19700
341	9500	19500	దేవనూరుడీలక్స్	11000	19000
4884	13500	17500	తెల్లకాయలు	5000	13000

వివాహిత అనుమానాస్పద మృతి



ఓర్సు జ్యోతి మృతదేహం

బెల్లంకొండ, జనవరి 30: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దుర్గి మండలం కొలగుంట్ల గ్రామానికి చెందిన జ్యోతికి సుమారు ఆరు సంవత్సరాల క్రితం బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన ఓర్సు సురేష్‌తో వివాహమైంది. భార్య, భర్తల మధ్య కొన్ని రోజుల నుంచి చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో జ్యోతి కడుపు నొప్పితో మృతి చెందినట్టు భర్త సురేష్ చెబుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. అనుమానాస్పదంగా మృతి చెందిందని, మెడకు వైరుతో బిగించి చంపినట్లుగా ఉందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జ్యోతి అనారోగ్య కారణాలతో మృతి చెందినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. మృతురాలు జ్యోతికి పరిమళరావు, అక్షయ అనే ఇరువురు సంతానం ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

రా.. కదలిరా సభ ప్రజా తిరుగుబాటుకు సంకేతం

- ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 30: రా.. కదలిరా సభకు అశేష జనం హాజరు అవటం వైసీపీ ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటుకు నిదర్శనం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ విజయవంతానికి కృషి చేసిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సభను విఫలం చేయాలని అధికార వైసీపీ ఎన్నో కుట్రలకు పాల్పడిందని ఆరోపించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల డ్వాక్రా అధికారులు, మెప్మా రిసోర్స్‌పర్సన్స్ సభలకు వెళ్లితే ఆసరా చెక్కులు, ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్లు నిలిపివేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికి మహిళలు పెద్దఎత్తున సభకు తరలివచ్చారన్నారు. సభకు వచ్చిన మహిళలను వేధించటం కానీ, పథకాలను నిలుపుదల చేయటం కానీ జరిగితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పథకాలు నిలిపివేస్తే రాబోయే రోజులో టీడీపీ అధికారంలోకి రాగానే ఆ మహిళలకు న్యాయం చేస్తామన్నారు. జనసేన పొలిట్‌బ్యూరో సభ్యుడు బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వద్రాణం మార్కండేయబాబు ప్రసంగాలు వైసీపీ అరాచకాలను నిలదీసేలా సాగాయన్నారు. పార్లమెంట్ పరిధిలో ఒకే ఒక సీటులో ఆర్యవైశ్యుడైన టీడీపీ నాయకుడు గెలుపొందితే అతనిని కూడా ప్రలోభపెట్టి జగన్‌రెడ్డి తనవైపు తిప్పుకున్నాడని ఆరోపించారు. నమ్మించి అవసరం తీరాక టిక్కెట్ లేదని ఆ ఆర్యవైశ్యుడిని నట్టేట ముంచారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ప్రకృతి వనరులను పెద్దఎత్తున దోచుకున్నాడని ఆరోపించారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కలిసి ముందుకు సాగుతామన్నారు. ముఖ్యంగా పోలీసుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ సభ నిర్వహణ, సభకు వచ్చే వేలాది మంది ప్రజానీకం గురించి జిల్లా ఎస్పీని కలిసి పలుమార్లు వివరాలు అందించారన్నారు. పోలీస్ బందోబస్తును కోరితే ఇచ్చామని చెబుతున్న పోలీసులు, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకపోవటం వల్ల పెద్దఎత్తున వాహనాలు రహదారులపై నిలిచిపోయి ప్రజలు సభకు హాజరు కాలేక ఇబ్బందులు పడ్డారన్నారు. అదే జగన్‌రెడ్డి సభలకు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇస్తారని, రవాణా శాఖ అధికారులే దగ్గర ఉండి స్కూల్ బస్సులను సభలకు కేటాయిస్తారని ఆరోపించారు. రానున్న రోజులో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందనే దానికి రా..కదలిరా సభ విజయవంతం కావటమే నిదర్శనం అన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు వైసీపీకి చెంపపెట్టు

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి 30: చంద్రబాబునాయుడుపై అక్రమంగా పెట్టిన కేసులలో ఒకటైన ఇన్నర్ రింగ్‌రోడ్డు విషయంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబునాయుడును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న వైసీపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పుతో ఇకనైనా కనువిప్పు కలగాలని కోరారు. అధికారగణంతో జగన్‌రెడ్డి పెట్టిన తప్పుడు కేసుల్లో ఎప్పటికైనా చంద్రబాబుకే న్యాయం జరుగుతుందన్నారు. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందని, సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు సీఎం జగన్, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వెన్నంటే వుంటారన్నారు. టీడీపీకి ఐదు కోట్ల ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు అని యరపతినేని తెలిపారు. నేషనల్ క్రైం రికార్డుల నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ మహిళలపై 43శాతం నేరాలు పెరిగాయని, దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలలో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో వుండగా, ఏపీలో ప్రతిరోజు 70 కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇన్ని జరుగుతున్నా సంబంధిత మహిళా మంత్రులు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగిత రేట్‌లలో ఏపీ మొదటి స్థానంలో వుందన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, భూమిపట్టాదారు చట్టం రద్దు చేయబడుతుందని, అన్యాక్రాంతమైన భూములను యజమానులకు అప్పగించేందుకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేస్తుందన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో 18 ఏళ్ల నిండిన మహిళలకు మహాశక్తి, ఆడబిడ్డనిధి, దీపం పథకాలను అందజేస్తామన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంఎల్‌సీలే పార్టీని వీడుతున్నారన్నారు.

జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు వెంటే ప్రజలు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 30: అధికార దుర్వినియోగంతో జగన్‌రెడ్డి అండ్ కో మచ్చలేని చంద్రబాబునాయుడుపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు వెంటే ఉన్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయలు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసులో ఎదురుదెబ్బ తగిలిందని సుప్రీంకోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. సుప్రీంకోర్టు వాఖ్యలకు జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలని అన్నారు. ఆలస్యమైనా అంతిమంగా నిజం గెలుస్తుందన్నారు. జగన్‌రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రం 13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. దేశంలో మహిళలపై నేరాలలో ఏపీ ఆరో స్థానంలో ఉందన్నారు. వైసీపీ నాయకులపై వ్యతిరేకత ఉందన్న కారణంతో ఒక సీటు నుంచి మరోసీటుకు మార్చుకుంటున్నారని, కానీ రాష్ట్రప్రజలు జగన్‌రెడ్డినే మార్చేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. 18 ఏళ్ళు నిండిన మహిళలకు మహాశక్తి పథకం కింద ఆడబిడ్డ నిధిగా నెలకు రూ.1500, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు.

జడ్పీలో స్థాయి సంఘం సమావేశాలు



స్థాయి సంఘం సమావేశాలు నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, జనవరి 30: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో మంగళవారం 10వ స్థాయి సంఘం సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశాలకు జడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మహాత్ముడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కోవెలమూడి రవీంద్ర

మహాత్ముడి బోధనలు నేటికీ అనుసరణీయం

● కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి మహాత్మా గాంధీ బోధనలు అనుసరణీయమని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పశ్చిమ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈరెంటి వరప్రసాద్, తల్లమ్ శేఖర్, వలివేటి కృష్ణ, పేరయ్య, రుస్తుం బాబు, కన్నా, పోపూరి నరేంద్ర తదితరులు మహాత్ముడికి నివాళులు అర్పించారు.

● సుప్రీంకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

సుప్రీంకోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని నాని అన్నారు. పశ్చిమ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ ఇన్నర్ రింగ్‌రోడ్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడం జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని ఎద్దేవా చేశారు. సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలతోనైనా జగన్, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా సరే రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వెంటే ఉన్నారన్నారు.

జాతిపితకి మొహమ్మద్ నసీర్ నివాళి



గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నసీర్, పార్టీ శ్రేణులు

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఇన్ చార్జి మొహమ్మద్ నసీర్ మహాత్ముడికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, తల్లం సత్యనారాయణ (కన్నా), చీతిరాల హేమంత్, డోగిపర్తి బద్రినాద్, మద్దుల సత్యం గుప్తా, బత్తిన శంకర్, శ్రీనునాయక్, మహంకాళీ నరసింహరావు, వేములకొండ శ్రీనివాస్, సురే శ్రీనివాస్, ఏడుకొండలు, బ్రహ్మసాని శ్రీనివాస్, ఖాసీంవలి, ఇమ్రాన్, రియాసత్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆదర్శాలు నేడు అనివార్యం : మన్నవ



మహాత్ముడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ ఆలోచనలు, ఆదర్శాలు నేడు అనివార్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహాత్ముడి ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు.

ప్రత్యేకహోదా సాధన ఉద్యమంలో భాగస్వాములు కావాలి

●రాజకీయ, ప్రజా సంఘాల నాయకుల పిలుపు

● విభజన హామీల సాధన ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దీక్ష

గుంటూరు(తూర్పు), జనవరి 30: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై చేస్తున్న పోరాటంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత వైఖరికి నిరసనగా ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న దీక్షలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. సమితి జిల్లా అధ్యక్షులు పీవీ మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలను సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న ప్రతి అంశాన్ని తాత్సారం చేస్తున్న మోదీ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మోసం చేసిన బీజేపీకి దానికి ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతు పలుకుతున్న రాష్ట్ర పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరముందన్నారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో పాటు రాజధానికి ప్రత్యేక నిధులు ఇస్తామని వెంకటేశ్వర స్వామి సాక్షిగా మాట ఇచ్చిన నరేంద్ర మోదీ మాట తప్పారని మండిపడ్డారు.



దీక్షలో పాల్గొన్న ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నాయకులు

ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీపై తిరుగుబాటు, కనీసం విమర్శ కూడా చేయలేని దుస్థితిలో పాలక, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఉండటం దౌర్భాగ్యమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ 25 ఎంపీ సీట్లు ఇవ్వండి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి తన కేసుల కోసం ప్రధాని వద్ద మోకరిల్లుతున్నారని ఎద్దేవా చేశారు. దీక్షలో ప్రజా సంఘాల నాయకులు మేడా హనుమంతరావు, అవధానుల హరి, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, రెంటాల కుమారి, రావుల అంజిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మాత్రమే కార్యకర్తల పార్టీ

● 'వల్లూరి' పాదయాత్ర అభినందనీయం

● రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి

గుంటూరు సిటీ, జనవరి 30 : దేశంలోని అనేక పార్టీలు కుటుంబ పార్టీ లని, ఒక్క బీజేపీ మాత్రమే కార్యకర్తల పార్టీ అని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో విజయసంకల్ప పాదయాత్ర ముగింపు సభ మంగళవారం గుంటూరులోని హిందూ కాలేజ్ గ్రౌండ్స్‌లో నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఖాదీ కమిషన్ మెంబర్ లలిత్‌షా హాజరయ్యారు. పురందేశ్వరి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రాభివృద్ధికి చేసిన సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన వల్లూరి జయప్రకాష్‌ను అభినందించారు. ఎందరో మహానుభావుల కృషితో ఇద్దరు ఎంపీల నుంచి 303 మంది పార్లమెంటు సభ్యులకు చేరటం కేవలం పార్టీ కార్యకర్తల కష్ట ఫలమేనని అన్నారు. ఈ పదేళ్లలో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మోదీ నాయకత్వంలో సుపరిపాలనను అందించిం దని అన్నారు. వల్లూరు జయప్రకాష్ మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికా రంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో అంత్యోదయ ధ్యేయంగా పాలిస్తున్నామని అన్నా రు. గుంటూరులో ఇళ్లు నిర్మించటంతో పాటు, ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకు మార్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, చందు సాంబశివరావు, మకుటం శివ, భీమనేని చంద్ర శేఖర్, మట్టాప్రసాద్, చిగురుపాటి కుమారస్వామి, షేక్ బాజీ, జూపూడి రంగరాజు, యడ్లపాటి రఘునాధబాబు, మిట్ట వంశీ, ఈదర శ్రీనివాసరెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, శనక్కాయల అరుణ, పాటిబండ్ల రామకృష్ణ, కొక్కె ర శ్రీనివాస్, లంక దినకర్, యామిని శర్మ, మాగంటి సుధాకర్ యాదవ్,



బీజేపీ విజయ సంకల్ప యాత్రలో పాల్గొని ప్రసంగిస్తున్న పురంధేశ్వరి

పాలపాటి రవికుమార్, కుమార్ గౌడ్, వైపీ సుబ్బారావు, పద్మనాభం, సుగుణ, నాగమల్లేశ్వరి, దారా అంబేడ్కర్, దర్శనం శ్రీనివాస్, ఏడుకొండలు గౌడ్, కారంసెట్టి రమేష్, రాజేష్ నాయుడు, రాష్ట్ర జిల్లా నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కేంద్రం వేసిన కమిటీని రద్దు చేయాలి

● పురంధేశ్వరికి మాలమహానాడు నేతల విజ్ఞప్తి

ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా కేంద్రం నియమించిన కమిటీని వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ దగ్గుబాటి పురందేశ్వరికి విజ్ఞప్తి చేశారు. నగరానికి విచ్చేసిన ఆమెను మాలమహానాడు నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. అన్నదమ్ములుగా జీవిస్తున్న మాల మాదిగల మధ్య వైరాన్ని, దూరాన్ని పెంచొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నేతలు గోదా జాన్ పాల్, శీలం రోజన్‌బాబు, భాగ్యారాజు, ఆనంద్, కృపా తదితరులున్నారు.

పారిశుధ్య అధ్వానంపై కమిషనర్ ఆగ్రహం

● శానిటరీ సెక్రెటరీ, ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 30: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరుశాతం జరగాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, అధికారులపై కఠినచర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ నందివెలుగు రోడ్, ఎల్బీనగర్, బాలాజీ నగర్, పాత గుంటూరు తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి బస్టాండ్ రోడ్, నందివెలుగు రోడ్ మున్సిపల్ స్కూల్ ఎదురు చెత్త కుప్పలు ఉండటంపై సంబంధిత సెక్రెటరీపై ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత శానిటేషన్ సెక్రెటరి, ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎంహెచ్‌వోని ఆదేశించారు. పర్యటనలో ఎంహెచ్‌వో(ఎఫ్‌ఏసీ) మధుసూదన్, శానిటరీ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ధర్నాను జయప్రదం చేయాలి

గుంటూరు(విద్య), జనవరి 30: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖలీద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమానికి భారీసంఖ్యలో ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ రూపొందించి, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, ఏపీఎస్‌సీ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1, 2 ఉద్యోగాలకు మున్సిపల్ ఉపాధ్యాయులకీ వయస్సు సడలింపు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా, పీఎఫ్ ఖాతాలు ఓపెన్ చేసి ఇప్పటివరకు జమయిన సొమ్మును లోన్స్ రూపంలో ఇవ్వాలని, అర్బన్ ఎంఈవో, డీవైఈవో పోస్టులు మంజూరు చేయాలని, విస్తరించిన నగరాలు, పట్టణాల్లో నూతన పాఠశాలలు నిర్మించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలనే ప్రధాన డిమాండ్స్‌తో ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

నొక్కిన సొమ్ము కక్కాడు!

● వైద్యుడికి రూ.1.20 లక్షలు కట్టిన ఉద్యోగి

● సస్పెండ్ చేయవద్దని ఉద్యోగి వేడుకోలు

● జీజీహెచ్‌లో కలకలం రేపిన కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు (మెడికల్) జనవరి 30: వైద్యుడు సొమ్మును నొక్కేసిన ప్రభుత్వ సమగ్రాస్పత్రి జూనియర్ అసిస్టెంట్ ఎంపీ జ్యోతిబాబు ఎట్టకేలకు సోమవారం తన తప్పును ఒప్పుకున్నారు. డాక్టర్‌కు డబ్బులు చెల్లిస్తానని, తనను సస్పెండ్ చేయవద్దని కాళ్ల బేరానికి వచ్చారు. అవినీతికి పాల్పడిన జ్యోతిబాబును సస్పెండ్ చేయకుండా తమాషా చేస్తున్నారా? అంటూ ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఉన్నతాధికారుల తీరుపై కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి స్పందన కార్యక్రమంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ కన్నెర్ర జేయడంతో వైద్యాధికారులు తత్తరపాటుకు గురయ్యారు. న్యూరాలజిస్ట్ గాజుల రామకృష్ణకు చెందిన రూ.83 వేలు నగదుకు 8.6శాతం వడ్డీతో కలిపి తక్షణం చెల్లించాలని ఆసుపత్రి విచారణ కమిటీ మంగళవారం ఆదేశించింది. దీని ప్రకారం లెక్కిస్తే చెల్లించాల్సిన నగదు రూ.1.55 లక్షలుగా తేలింది. మంగళవారం జ్యోతిబాబు రూ.1.20 లక్షలను డాక్టర్ రామకృష్ణ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశారు. మిగిలిన రూ.30 వేలను బుధవారం చెల్లిస్తానని అతడు విజ్ఞప్తి చేయగా, జీజీహెచ్ అధికారులు అంగీకరించారు.

జాతీయ స్థాయి పోటీలకు

సీతారామయ్య హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్టిఫికెట్లతో అభినందిస్తున్న పాటిబండ్ల విష్ణు, వరప్రసాదరావు తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 30: స్థానిక లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సీబీఎస్ఈ విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. ఈనెల 28న బీఆర్ స్టేడియం నందు జరిగిన స్టేట్ చాంపియన్ షిప్‌లో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విద్యార్థినులు బి. హర్షవర్ధని 8వ తరగతి, బి.రమ్య 5వ తరగతి డబల్ స్టిక్ ఆటలో పాల్గొని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. సందర్భంగా పాటిబండ్ల విష్ణువర్ధన్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బ్రాడీపేటలో త్యాగరాజ స్వామి ఆరాధన

గుంటూరు, జనవరి 30: బ్రాడీపేట 2/14వ లైనులో నాగార్జున మ్యూజిక్ కాలేజ్ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవం మంగళవారం జరిగింది. త్రిమూర్తులుగా ఉన్న త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి విగ్రహాలకు పూజచేసి గీతాలతో త్యాగరాజ స్వామిని తలుచు కుంటూ మ్యూజిక్ కాలేజ్‌కు చెందిన టీచర్లు కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రటరీ కే సూర్యనారాయణ నేతృత్వంలో జరి గిన కార్యక్రమంలో కళాశాలకు చెందిన ఓకల్ టీచర్ శాంతి, వయోలిన్, కీ బోర్డుపై రాజ్యలక్ష్మి ఉన్నారు.

నీటి సరఫరాలో అసౌకర్యం కలిగితే ఉపేక్షించేది లేదు

● ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ హెచ్చరిక

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 30: తాగునీటి సరఫరాలో ప్రజలకు అసౌకర్యం కల్గితే ఉపేక్షించబోమని, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాను పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నగరంలో తాగునీటి సరఫరా, పైప్‌లైన్ల మరమత్తులపై ఎస్ఈ, ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రిజర్వాయర్ల వారిగా ఇంజనీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడా ప్రజలకు తాగునీటి సరఫరాలో కలుషిత నీరు సరఫరా వంటి సమస్యలు తలెత్తకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పీజీ డిప్లొమాలు



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. 'రూరల్ డెవలప్‌మెంట్(గ్రామీణాభివృద్ధి)' ప్రధానాంశంగా వీటిని రూపొందించారు. ఇవి పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పర్సనల్ ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్‌లను తప్పనిసరిగా తెలపాలి. ప్రోగ్రామ్ మొదటి ట్రైమెస్టర్‌లో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు సంస్థ స్కాలర్‌షిప్‌లు అందిస్తుంది.

పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-రూరల్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం-ఆర్ఎం): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. క్యాట్/ ఎక్స్ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ఈ స్కోర్ ఆధారంగానే అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో చూపిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (పీజీడీఆర్‌డీఎం): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** ఏడాదికి రూ.2,20,500
- **భోజన, వసతి ఖర్చులు:** ఏడాదికి రూ.1,11,000
- **కాషన్ డిపాజిట్:** రూ.10,000
- **సీట్ రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.20,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** www.nirdpr.org.in

కొమెడ్‌కె యూజీఈటీ నోటిఫికేషన్

కన్సార్షియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్ అండ్ డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక(కొమెడ్‌కె)- ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(యూజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 400 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ని నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. సింగిల్ విండో సిస్టమ్‌ను అనుసరిస్తారు. కొమెడ్‌కెలో సభ్యత్వమున్న 190 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 20,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగాలు, పార్టిసిపేటింగ్ కళాశాలల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టులలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. కెమిస్ట్రీకి బదులుగా బయోటెక్నాలజీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ చదివినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్స్ ఉండవు.

కొమెడ్‌కె యూజీఈటీ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ). ఇందులో మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 60 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన సీబీఎస్ఈ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 180. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్థ 11 విభిన్న మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. వీటి కోసం విడిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 15 నుంచి ఈ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయి.

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 1 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www. comedk.org

ఏఐఐఏలో పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీవీఈటీ) గుర్తింపు ఉంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ ఎగ్జామ్/కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సును ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధిస్తారు. కోర్సులో భాగంగా థియరీ, ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు చివరలో థియరీ అండ్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. దీనిని హెల్త్‌కేర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్(హెచ్ఎస్ఎస్సీ) నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి హెచ్ఎస్ఎస్సీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థలు, ఆయుర్వేదిక్ హాస్పిటల్స్, పంచకర్మ సెంటర్స్, హెల్త్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 16 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. మానసిక, శారీరక దృఢత్వం తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **కాషన్ డిపాజిట్:** రూ.5000
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 10
- **వెబ్‌సైట్:** https://aiia.gov.in

దిక్సూచి DIKSUCHI

ఎన్‌డీఏలో గ్రూప్ 'సి' పోస్టులు

జాబ్ కార్నర్

పుణె ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కింద పేర్కొన్న గ్రూప్ 'సి'(బ్యాక్‌లాగ్ సహా) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



మొత్తం ఖాళీలు: 198

1. లోయర్ డివిజన్ క్లర్క్: 16 పోస్టులు
2. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2: 1
3. డ్రాఫ్ట్స్‌మన్: 2
4. సినిమా ప్రొజెక్షనిస్ట్-2: 1
5. కుక్: 14
6. కంపోజిటర్-కమ్ ప్రింటర్: 1
7. సివిలియన్ మోటార్ డ్రైవర్ (ఓజీ): 3
8. కార్పెంటర్: 2
9. ఫైర్‌మన్: 2
10. టీఏ - బేకర్ అండ్ కాన్ఫెక్షనర్: 1
11. టీఏ - సైకిల్ రిపేరర్: 2
12. టీఏ - ప్రింటింగ్ మెషిన్ ఆపరేటర్: 1
13. టీఏ - బూట్ రిపేరర్: 1
14. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఆఫీస్ అండ్ ట్రెయినింగ్: 151

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: https://ndacivrect.gov.in/

నాల్కోలో జూనియర్ ఫోర్‌మెన్

మొత్తం ఖాళీలు: 42

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఎల్‌సీఓ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ ఫోర్‌మన్(షార్ట్ ఫైర్ బ్లాస్టర్): 2 పోస్టులు
2. జూనియర్ ఫోర్‌మన్(ఓవెర్‌మన్/మైన్స్): 18
3. జూనియర్ ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): 5
4. జూనియర్ ఫోర్‌మన్(సర్వేయర్): 5
5. జూనియర్ ఫోర్‌మన్(సివిల్): 2
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్ గ్రేడ్-3: 2
7. డ్రెస్సర్ కమ్ ఫస్ట్ ఎయిడర్: 4
8. నర్స్ గ్రేడ్-3: 4

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, హెచ్ఎస్సీ, డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్/మైనింగ్, మైనింగ్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18

దరఖాస్తు ఫీజు: రూ.100

వెబ్‌సైట్: https://nalcoindia.com

The Secret of Work National Level Scholarship Test

SCHOLARSHIP ALERT

Description: The Secret of Work National Level Scholarship Test 2024 is a competition organised by the Aaryajanani Trust (NGO) in association with Ramakrishna Math, for all youth aged between 18 and 30, regardless of qualifications or nationality.

Eligibility: Open for students aged between 18 to 30 years.

Prizes & Rewards: Up to 50,000 (one-time)

Last Date to Apply: 15-02-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/SWRN1

Narotam Sekhsaria Scholarship Programme

Description: Narotam Sekhsaria Scholarship Programme 2024 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation (a non-profit organisation set up by an endowment from Mr. Narotam Sekhsaria) to financially support meritorious Indian students who are willing to pursue higher studies from top-ranking institutions in India and abroad.



Eligibility: Open for Indian citizens under 30 (as of January 31st, 2024) who have completed or are nearing completion of their graduate degree from an accredited Indian university. Applicants must have enrolled in postgraduate degrees at top institutions in India or abroad, starting Fall 2024. Even applicants awaiting university acceptance can apply, but the scholarship is conditional upon securing admission.

Prizes & Rewards: Interest-free scholarship loan and mentorship guidance.

Last Date to Apply: 14-03-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/NSP6

National Institute of Public Co-operation and Child Development Internship

Description: National Institute of Public Cooperation and Child Development Internship 2024 is an opportunity offered by the National Institute of Public Cooperation and Child Development (NIPCCD), New Delhi, for postgraduate and research students. This programme aims to familiarise interested and motivated students with the overall process of training and research in Women & Child Development schemes and programs.

Eligibility: Open for postgraduate or research students pursuing studies at various universities and recognized research institutes.

Prizes & Rewards: A monthly honorarium of up to 5,000 and other incentives

Last Date to Apply: 31-03-2024

Application mode: via email or post to: NIPCCD, Coordination Unit, 5 Siri Institutional Area, Hauz Khas New Delhi - 110016 Email ID: punipccd@gov.in

Short Url: www.b4s.in/aj/NIPC1

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yUaTypSలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పద్మశ్రీ అవార్డ్ విజేతలకు చిరు సత్కారం

పద్మశ్రీ పురస్కారం పొందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, స్థపతి ఎ.వేలు ఆనందాచారిలను పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత మెగాస్టార్ చిరంజీవి సోమవారం తన ఇంట్లో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న యక్షగాన కళారూపానికి జీవం పోస్తున్న సమ్మయ్యకు పద్మశ్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. చిత్తూరు జిల్లా వెన్నంపల్లికి చెందిన ఆనందాచారి స్థపతిగా దేవాదాయశాఖలో పనిచేశారు. అనేక ఆలయ నిర్మాణాలకు శిల్పకళా నైపుణ్యాన్ని అందించారు. శిల్పశాస్త్ర విషయాలను శిల్పకళాకారులకు నేర్పిస్తూ ఆయన చేస్తున్న సేవలను చిరంజీవి కొనియాడారు. ఇలాంటి కళారూపాలను గుర్తించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చిరంజీవిని సమ్మయ్య, ఆనందాచారి కూడా సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళలను కాపాడాలని ఇరువురూ కోరారు.

సెప్టెంబర్‌లో ఓజీ రాక

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 27న 'ఓజీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం మంగళవారం ప్రకటించింది.



1950ల నాటి ముంబై మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో సుజీత్ ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. గతంలో పవన్ కల్యాణ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'అత్తారింటికి దారేది' చిత్రం కూడా సెప్టెంబర్ 27న విడుదలై ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది.



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కూతురు భవతరిణి ఇటీవలే అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. నటుడు మంచు మోహన్‌బాబు ఇళయరాజా ఇంటికి వెళ్లి ఆయన్ను ఓదార్చారు. ఈ విషయాన్ని మంగళవారం ఆయన సోషల్ మీడియాద్వారా తెలిపారు.

మనసుల్ని కదిలించే సినిమా ఇది



'ఈ సినిమాకోసం ఎక్కువరోజులు ప్రిపేర్ అయ్యాను. బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నాను. కథతో కనెక్ట్ అవ్వడానికి సీన్స్ మళ్లీ మళ్లీ ప్రాక్టీస్ చేశాను. పాత్ర కోసం రెండు సార్లు గుండు గీయించుకున్నాను. నా రెండేళ్ల కష్టం ఈ సినిమా. మంచి ఫలితం వస్తుందని ఆశగా ఉన్నాను. అన్నారు హీరో సుహాస్. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండు'. శివాని నాగారం కథానాయిక. దుష్యంత్ కటికనేని దర్శకుడు. వెంకటేశ్ మహా, ధీరజ్ మొగిలినేని కలిసి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుహాస్ విలేకరులతో ముచ్చటించారు. 'దుష్యంత్ రాసిన కథ నన్ను కదిలించింది. రియల్‌లైఫ్‌లో తను చూసిన కొన్ని సంఘటనల స్ఫూర్తి ఈ కథలో ఉంది. లాక్‌డౌన్ టైమ్ కాబట్టి స్క్రిప్ట్‌ను బాగా స్టడీ చేసే అవకాశం దొరికింది. కథ మీద నమ్మకంతోనే గుండు గీయించుకున్నా. 2007లో జరిగే కథ ఇది. ఇంటర్వెల్ ఇరవై నిమిషాల ముందు వరకు సరదాగా సాగుతుంది. అక్కడ్నుంచి వేరే లెవల్‌కు వెళుతుంది. సెకండాఫ్ మొత్తం ఎమోషనల్ ఫీల్. 'కలర్ ఫొటో'ను మించిన హై ఎమోషన్ ఈ కథలో ఉంటుంది' అని చెప్పారు సుహాస్. ఇంకా మాట్లాడుతూ 'మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుంది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ కథ. నేను, శరణ్య కవలలం. మాఇద్దరి పుట్టినరోజున జరిగిన సంఘటనలు మీ జీవితాలను ఎలాంటి మలుపు తిప్పాయి అనేది ఈ మూవీలో కీలకంగా ఉండే అంశం. కథలోని చాలా సీన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయి. వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఫైనల్ కాపీ చూశాక సినిమాపై నమ్మకం కుదిరింది. ముఖ్యంగా శేఖర్‌చంద్ర నేపథ్య సంగీతం సినిమాను మరో రేంజ్‌కి తీసుకెళ్లింది. ఇందులో కథానాయికగా పరిచయం అవుతున్న శివానికి మంచి ఫ్యూచర్ ఉంది. మంచి నటి తను. సినిమా విషయంలో మేమంతా కాన్ఫిడెంట్‌తో ఉన్నాం. ఫిబ్రవరి 2న అందరూ థియేటర్‌కెళ్లి చూడాలని కోరుకుంటున్నా' అన్నారు సుహాస్.

'సంఘీ' తప్పుడు పదమని నా కూతురు అనలేదు

రజనీకాంత్



"సంఘీ' అనేది ఎవరి వ్యక్తిత్వాన్నీ కించపరిచే పదం కాదు, ఎవరినో అవమానించాలనే ఆలోచన నా కూతురు ఐశ్వర్యకు లేదు" అని రజనీకాంత్ అన్నారు. ఇటీవలే జరిగిన 'లాల్‌సలామ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో ఐశ్వర్య 'నా తండ్రి సంఘీ కాదు' అంటూ ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలను రజనీకాంత్ సమర్థించుకున్నారు. ఆ చిత్రం ఆడియో ఈవెంట్‌లో ఐశ్వర్య మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో మా నాన్నని కొందరు 'సంఘీ' అంటూ విమర్శిస్తున్నారు. నా తండ్రి సంఘీ అయి ఉంటే 'లాల్‌సలామ్' లాంటి సినిమా చేసుండేవారు కాదు. ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అంటారని తర్వాత తెలిసింది. ఈ వేదిక సాక్షిగా చెబుతున్నాను. మా నాన్న 'సంఘీ' కాదు. ఆయన అలాంటివారైతే నా 'లాల్ సలామ్'లో నటించేవారే కాదు' అని ఐశ్వర్య చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. హిందుత్వ వాదాన్ని బలపరచడం తప్పు ఎలా అవుతుంది అని నెటిజన్లు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కడప జిల్లాలో జరుగుతున్న 'వేట్టైయాన్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న రజనీకాంత్ ఈ వివాదంపై మీడియా ముందు స్పందించారు. 'నా కూతురు ఎక్కడా తప్పుగా మాట్లాడలేదు. 'సంఘీ' అనేది తప్పుడు పదం అని తను చెప్పలేదు. తన తండ్రిని ఆ ఉద్దేశంతో చూడొద్దు అని మాత్రమే చెప్పింది. 'ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తిని అలాంటి దృష్టితో ఎందుకు చూస్తున్నారు' అని ప్రశ్నించడం ఆమె ఉద్దేశం'అని చెప్పారు. 'లాల్‌సలామ్' సినిమాకు ఐశ్వర్య దర్శకురాలు కావడం వల్ల ఆ సినిమాకు ప్రచారం కల్పించేందుకే ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారా అని విలేకరులు అడగ్గా అలాంటి అవసరం తమకు లేదని కొట్టిపారేశారు. ఫిబ్రవరి 9న 'లాల్ సలామ్' చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ఇల్లు కొందామనుకున్న డబ్బు ఈ సినిమాలో పెట్టా

సొహైల్



'పాషా లాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం. సినిమా అంటే ప్యాషన్‌తో చాలా హార్డ్ వర్క్ చేసి ఈ సినిమా తీశారు. సగం సినిమా పూర్తయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. అప్పుడు మా నాన్న రిటైర్‌మెంట్ పైసలు, ఇల్లు కొందామని నేను దాచుకున్న డబ్బు ఈ సినిమాకు పెట్టా. నిర్మాత దిల్‌రాజుగారికి మా పరిస్థితి చెబితే 'తెలంగాణ నేను చూసుకుంటా. నువ్వు టెన్షన్ పడొద్దు' అని ధైర్యం చెప్పారు. ఆయనకు నా కృతజ్ఞతలు' అన్నారు 'బిగ్‌బాస్' సొహైల్. ఆయన హీరోగా నటించిన 'బూట్‌కట్ బాలరాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన చాలా ఎమోషనల్ అయ్యారు. 'మనం జీవితంలో ఓడినా గెలిచినా ఏ తల్లికీ కొడుకు మీద ప్రేమ పోదు. అదే ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. ఇందులో ఫన్ ఎమోషన్ ఉంది. హీరోయిన్ మేఘలేఖ చక్కగా నటించడమే కాకుండా మా పరిస్థితిని అర్థం చేసుకుని సపోర్ట్‌గా నిలిచారు. దయచేసి ఈ సినిమాను థియేటర్‌లోనే చూడాలని అందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నాను' అన్నారు సొహైల్. చిత్ర దర్శకుడు శ్రీకోనేటి మాట్లాడుతూ 'కథ దగ్గర నుంచి సినిమా తయారయ్యే వరకూ ఈ ప్రయాణంలో బెక్కం వేణుగోపాల్ ఎంతో సహకరించారు. సొహైల్ ఈ సినిమాను తన భుజాల మీద వేసుకుని నడిపించారు. వినోదంతో పాటు మంచి భావోద్వేగం ఉన్న చిత్రమిది' అని చెప్పారు. సొహైల్ ఇమేజ్‌కి తగ్గ కథను ఎన్నుకున్నామనీ, యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా చిత్రాన్ని తీర్చిదిద్దామనీ బెక్కం వేణుగోపాల్ చెప్పారు. సొహైల్‌కు సినిమా అంటే చాలా ఇష్టం. అతనితో ఈ చిత్రం నిర్మించడం గర్వంగా ఉందని నిర్మాత పాషా చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోలు మంచు మనోజ్, సందీప్ కిషన్, రోషన్ కనకాల, విరాజ్ అశ్విన్, బ్రహ్మానందం, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తదితరులు పాల్గొని చిత్రం విజయం సాధించాలని కోరారు.

ముహూర్తం కుదిరింది



'అంటే సుందరానికి' లాంటి హిట్ చిత్రం తర్వాత నాని - దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో వస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నానికి జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ నటిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుతారు

అపూర్వరావ్



'హ్యాపీ ఎండింగ్ ప్యూర్ యూత్‌ఫుల్ మూవీ. ఇందులో హ్యూమర్‌కి కొదవుండదు. ప్రతి పదినిమిషాలకోసారి పగలబడి నవ్వుకుంటారు' అంటున్నారు కథానాయిక అపూర్వరావ్. 'హ్యాపీ ఎండింగ్' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నారు. యష్ పూరి హీరోగా, కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేశ్ కుమార్, సంజయ్‌రెడ్డి, అనిల్ పల్లాల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అపూర్వరావ్ విలేకరులతో మాట్లాడారు. 'మా నేటివ్ ప్లేస్ ఒంగోలు. నాకు నటనంటే పిచ్చి. ఇంట్లోవాళ్ల సహకారం లేదు. ఇక పట్టుబట్టి, వాళ్లను ఒప్పించి హైదరాబాద్‌లో దాదాపాల్కే ఫిల్మ్‌స్కూల్‌లో జాయినై ట్రైనింగ్ తీసుకున్నాను. ఆ టైమ్‌లో పరిచయమైన కొందరు అసిస్టెంట్ డైరెక్టర్లు, వాళ్ల కామన్ ఫ్రెండ్స్ ద్వారా 'హ్యాపీ ఎండింగ్' ఆడిషన్స్‌కు వెళ్లే అవకాశం వచ్చింది. బాగా పర్‌ఫార్మ్ చేసే తెలుగమ్మాయి కోసం చూస్తున్న వాళ్లకు నేను నచ్చాను. అలా ఈ సినిమాలో అవకాశం దొరికింది. ఒక మంచి ఎంటర్‌టైనర్ ద్వారా పరిచయం అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/H8CWAn4 లో చదవండి.

చిరువ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ



చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి, జనవరి 30: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మహమ్మద్ హుస్సేన్ జ్ఞాపకార్థం వారి కుమారుల సంయుక్త సహకారంతో మంగళగిరి పట్టణానికి చెందిన ఎనిమిది మంది చిరువ్యాపారులకు తోపుడు బండ్లను అందజేశారు. పాతబస్టాండు సెంటర్లో మంగళవారం ఈ బండ్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులు లోకేశ్, హుస్సేన్ కుమారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలోని పేదలు, చిరువ్యాపారుల సంక్షేమానికి అనేక సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వేలాది మందికి వివిధ రకాల బండ్లను అందజేశారన్నారు. లోకేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని స్థానిక టీడీపీ నేతలు వారి ఆర్థిక స్తోమతకు తగ్గట్టుగా పేదలకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, నేతలు మహమ్మద్ ఇబ్రహీం, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, సంకా బాలాజీగుప్తా, ఆకుల ఉమామహేశ్వరరావు, షేక్ సుభానీ, అబ్దుల్లా ఖాన్ వాకా మాధవరావు, బోగి వినోద్, షేక్ హుసన్, మౌలాలీ, రుద్రు శ్రీనివాసరావు, వల్లభనేని భార్గవ్, విన్నకోట శ్రీనివాసరావు, బైరబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ఎంటీఎంసీ పరిధిలో..

తాడేపల్లి, జనవరి 30: ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండకు చెందిన కె భారతి, మేఘావత్ లక్ష్మి అద్దె తోపుడు, టిఫిన్ బండ్లపై చిరువ్యాపారం నిర్వహిస్తూ సొంత బండి లేక ఇబ్బంది పడుతున్నారు. సొంత బండి అందజేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు అర్జీ రూపంలో విన్నవించగా స్పందించిన లోకేశ్ మంగళవారం స్థానిక టీడీపీ నాయకులచే తోపుడు బండి, టిఫిన్ బండి అందజేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, కొలనుకొండ గ్రామ అధ్యక్షుడు కంచర్ల రంగరావు, గోరా రంగరావు, జనసేన మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు లింగా శ్రీకాంత్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

● వాణిజ్య విభాగం అధ్యక్షుడు సూర్యవేణుగోపాలకృష్ణ



మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, జనవరి 30: సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో మంగళవారం గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు దామర్ల రాజు, తోట పార్థసారధి, నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్, సంకా బాలాజీగుప్తా, వాకా మాధవరావు, ఆరుద్ర భూలక్ష్మి, మంచికలపూడి వైష్ణవి, షేక్ సుభానీ, అబ్దుల్లా ఖాన్, కఠారి అప్పారావు, నల్లగొండ పరమేశ్వరరావు, బైరబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, జనవరి 30: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత నేతృత్వంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోస్త్ ఆధ్వర్యంలో రైలుపేట చెక్ పోస్ట్ వద్ద, శివాలయం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహాలకు ట్రైనీ డీఎస్పీ, దుగ్గిరాల ఎస్‌హెచ్‌వో పి.గీతాకుమారి, దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, జంపాల సుబ్బారావు తదితరులు నివాళులర్పించారు.

పెదనందిపాడు, జనవరి 30 : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పారిశ్రామికవేత్తలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, వంకాయల విద్యాసాగర్‌గుప్తా, దాసరి సత్యనారాయణ, మామిడిపాక రంగారావు, పొత్తూరి కృష్ణ, దాసరి రాధా పాల్గొన్నారు.

● స్థానిక బొడ్డురాయి సెంటర్లోని శాఖ గ్రంథాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి ప్రజాప్రతినిధులు కానీ రాజకీయ పార్టీ నేతలు గానీ పూలమాల కూడా వేయకపోవడంతో విమర్శలకు దారితీసింది.

కాకుమాను, జనవరి 30: కాకుమానులో గాంధీజీ, ఆచార్య ఎన్జీ రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నా

మహిళల ఆర్థికాభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యం

● లోకేశ్ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ : తమ్మిశెట్టి జానకీదేవి



శిక్షణ పూర్తిచేసుకుని కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

మంగళగిరి సిటీ, జనవరి 30: మహిళల ఆర్థికాభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అమలు చేస్తున్న స్త్రీ శక్తి కార్యక్రమంలో భాగంగా 42వ బ్యాచ్‌లో మంగళగిరి పట్టణం, మండలానికి చెందిన 60 మంది మహిళలు రెండు నెలలపాటు కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరికి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో మంగళవారం లోకేశ్ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, కార్యదర్శి వింజమూరి ఆశాబాల, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మండల అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, సింహాద్రి బేబీరాణి, యర్రంశెట్టి సునీత, అప్పల శాంతి, యలమించిలి పద్మజ, గుమ్మడి కోటేశ్వరమ్మ, మోతుకూరి సుజాత, గడ్డిపాటి తులసీ, దివి లక్ష్మి పాల్గొన్నారు.

బాలసాని పుట్టిన రోజు వేడుకల పేరుతో రచ్చ రచ్చ

● అనుమతులు లేకుండానే డీజేలు, ర్యాలీలు.. నిలిచిపోయిన ట్రాఫిక్



ర్యాలీ కారణంగా ప్రత్తిపాడులో నిలిచి పోయిన ట్రాఫిక్

ప్రత్తిపాడు, జనవరి 30: ప్రత్తిపాడు వైసీపీ సమన్వయకర్త బాలసాని కిరణ్‌కుమార్ జన్మదిన వేడుకల పుణ్యమా అని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సాయంత్రం సమయంలో రద్దీగా ఉండే ప్రత్తిపాడులో ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యకర్తల నుంచి ఏ మాత్రం స్పందన లేనప్పటికీ ప్రధాన రహదారిలో వారు చేసిన హడావిడికి మాత్రం గంటల తరబడి ట్రాఫిక్ ఆగిపోయింది. కార్యకర్తలు లేక ర్యాలీ పేలవంగా సాగుతుంది.. మన పరువుపోతుంది అనుకున్న పార్టీ నాయకులు ట్రాఫిక్‌ను ఆపివేసి రద్దీని చూపించే ప్రయత్నం చేశారు. ఒక పక్క రెండు డీజేలు, రెండు టీంల తప్పెట్ల బ్యాచ్‌లు ఉండటంతో వీటితోనే అక్కడ రద్దీ ఎక్కువగా కనిపించింది. అయితే స్థానికంగా మాత్రం వైసీపీ క్యాడర్ నుంచి పూర్తి నిరాదరణే ఎదురైంది.

● ఇటీవల ప్రత్తిపాడులో ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు ఉండాలి.. అనుమతలు తీసుకున్న తరువాతనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి అంటూ పంచాయతీ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాలు వైసీపీ నాయకులకు మాత్రం వర్తించవు. మంగళవారం బాలసాని పుట్టిన రోజుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో మాత్రం చూస్తూ ఊరుకుండి పోయారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా డీజేలు, ర్యాలీలు ఏర్పాటు చేసినా.. పోలీసులు మాత్రం బందోబస్తు ఏర్పాటు చేశారు తప్ప మారు మాట్లాడే ధైర్యం చేయలేక పోయారు. అయితే ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన ర్యాలీ విషయంలో ప్రజల నుంచి పూర్తి వ్యతిరేకత వ్యక్తమైంది. పుట్టిన రోజు అయితే ఎక్కడో కేక్ కట్ చేసుకుని సంబరాలు చేసుకోవాలి గాని, ఈ విధంగా ర్యాలీలు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం ఏమిటంటూ బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే గుంటూరు - పర్చూరు రహదారిలో వాహన రాకపోకలకు తీవ్ర స్థాయిలో అంతరాయం ఏర్పడింది.

1087 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జనవరి 30: స్థానిక పసుపుమార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 1087 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9100 గరిష్ఠధర రూ.11,230 మోడల్‌ధర రూ.10,000 పలికాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 9,100 గరిష్ఠధర రూ.11.230 మోడల్‌ధర రూ.9,500 పలికాయి.

పెదనందిపాడు ఇన్‌చార్జ్ ఎస్ఐగా రవీంద్ర

పెదనందిపాడు, జనవరి 30: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారుల బదిలీల ప్రక్రియలో భాగంగా పెదనందిపాడు ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ అబ్దుల్‌రెహమాన్ మంగళవారం ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇక్కడకు కాకుమాను ఎస్ఐ రవీంద్రను ఇన్‌చార్జ్ ఎస్ఐగా నియమించారు.

ఎర్రబాలెం జనసేన అధ్యక్షుడిగా సాయినందన్

మంగళగిరి, జనవరి 30: జనసేన పార్టీ ఎర్రబాలెం గ్రామ అధ్యక్షుడిగా లేళ్ల సాయినందన్‌ను నియమిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు ప్రకటించారు. పార్టీని బలోపేతం కార్యాచరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఎర్రబాలెం అధ్యక్షుడిగా ఇప్పటివరకు పనిచేసిన కాపరౌతు సుందరయ్యకు పార్టీ సముచితస్థానం కల్పిస్తుందని తెలియజేశారు.

సమగ్ర కులగణన చేపట్టడం అభినందనీయం

మంగళగిరి, జనవరి 30: దేశంలో బీహార్ తరువాత ఏపీలో సమగ్ర కుల గణన చేపట్టడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీ వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక రంగాల్లో న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరి అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఉడతా శ్రీనివాసరావు, నేతలు కాగితాల స్వాతి, దానాగౌడ్, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ లేక తొలిరోజే అభాసుపాలు



రిజిస్ట్రేషన్ కోసం పడిగాపులు పడుతున్న లబ్ధిదారులు

ప్రత్తిపాడు, జనవరి 30: జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం శ్రీకారం చుట్టిన తొలిరోజే అభాసుపాలయింది. జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం సచివాలయానికి రండి అంటూ అందరికీ సమాచారం అందించారు. అయితే ఉదయాన్నే సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు సాయంత్రం వరకు అలాగే వేచి ఉన్నారు. మూడు సచివాలయాలకు చెందిన సిబ్బంది మొత్తం పంచాయతీ కార్యాలయానికి చేరి అక్కడ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం సిద్ధం చేసుకున్నారు. తీరా సర్వర్ రాకపోవడంతో సాయంత్రం వరకు పడిగాపులు పడుతూనే ఉన్నారు.

మూతబడిన హెల్త్ క్లినిక్



ప్రత్తిపాడు, జనవరి 30: జగనన్న సురక్ష మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారంటే.. మండలంలో ఉన్న హెల్త్ క్లినిక్‌లు మొత్తం మూతబడి పోవాల్సిందే. ఇక్కడ పనిచేస్తున్న ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు మెడికల్ క్యాంపులో సేవలు అందిస్తుండటంతో హెల్త్ క్లినిక్‌లు మూతపడిపోతున్నాయి. తిక్కిరెడ్డిపాలెంలో సురక్ష కార్యక్రమం నిర్వహిస్తే ప్రత్తిపాడులోని హెల్త్‌క్లినిక్‌లు మూతబడ్డాయి.



ఉంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీనివాసునికి స్వర్ణ పుష్పార్చన

● ఘనంగా వసంతోత్సవం ● సేవలు దర్శించి తరిస్తున్న భక్తజనం

తెనాలి అర్బన్, జనవరి 30: శ్రీవేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాల్లో స్వామివారిని మంగళవారం స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. కొత్తపేటలోని తాలూకా జూనియర్ కళాశాలలో శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా వేకువ జామున తిరుమలలో జరిగిన విధంగా స్వామికి సుప్రభాత సేవ, హోమాల సేవ, అర్చన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో గణపతి, నవగ్రహ, సుదర్శన హోమాలు జరిపారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వసంతోత్సవం నిర్వహించారు. తిరుమలలో స్వయంగా చూడలేని సేవలను ఇక్కడ ఏర్పాటు చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించి తరిస్తున్నారు. శృంగేరీ శారదాపీఠం ఆస్థాన పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి, వెంకటేశ్వర వైభవాన్ని ప్రవచనం చేశారు. సౌందర్య లహరి సహస్ర గళార్చన కార్యక్రమంలో 600మంది మహిళలు పాల్గొన్నారు. సంపత్‌కుమార్ రామానుజ జీయర్‌స్వామి శ్రీనివాసుని దర్శించి విశిష్టతను భక్తులకు వివరించారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి వుప్పల నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య రామకృష్ణ, లోకనాథం, నరేంద్రస్వామి, జయలక్ష్మి పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

● 33 అంశాల ఆమోదం

తెనాలి అర్బన్, జనవరి 30: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 31వ వార్డులో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి ప్రస్తావించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనూష పనితీరు సక్రమంగా లేదని ఆరోపించి ఆమెను తన వార్డు నుంచి మార్చాలని చైర్‌పర్సన్‌ను కోరారు. సమావేశం అనంతరం ఈ విషయం మాట్లాడదామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఎజెండాలోని 33 అంశాలు సభ్యులకు వివరించి ఆమోదించారు. పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తగిన సహకారం అందించాలని చైర్‌పర్సన్ కోరారు. వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ జస్వంతరావు, ఎంఈ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడికి తుమ్మల పురస్కారం

తెనాలి అర్బన్, జనవరి 30: ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడికి సాహిత్య ఉద్యమ నిర్మాత కామ్రేడ్ తుమ్మల వెంకట్రామయ్య సాహిత్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ తెలిపారు. కవిరాజా పార్కులో బుధవారం నిర్వహించే కార్యక్రమంలో ఆయనను ఈ పురస్కారంతో సత్కరిస్తామన్నారు. మన వారసత్వం పేరుతో తెలుగు సంస్కృతి సంప్రదాయలను నేటి తరానికి అందించే గ్రంథానికి డాక్టర్ బాబు సంపాదకత్వం వహించారని చెప్పారు. పురస్కార కార్యక్రమాన్ని కళాభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి

పొన్నూరు టౌన్, చేబ్రోలు, జనవరి 30: పొన్నూరు, చేబ్రోలు మండలాలల్లో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ ఆలయంలో ఆయన విగ్రహానికి, జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. చేబ్రోలులోని పలు ప్రాంతాల్లో మహాత్ముడి విగ్రహాల వద్ద వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి రోశయ్య గుప్తా, జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపలి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు, గుడివాడ పద్మశేఖర్, ఆలపాటి సాంబశివరావు, అవ్వారు వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని గాంధీ జీవిత చరిత్రను వివరించారు.



తెనాలిలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పొన్నూరులో మహత్మగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

● తెనాలి అర్బన్, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతి మంగళవారం పట్టణంలో నిర్వహించారు. గాంధీచౌక్‌లో గాంధీజీ విగ్రహానికి వైసీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా తెనాలి పట్టణానికి పలుచోట్లకు గాంధీజీ వచ్చారని గుర్తుచేశారు. గుగ్గిలం రాము, మీరావళి, లక్ష్మీనారాయణ, సాయి, గురునాథగుప్తా, శ్యామలరావు, అంజనేయులు పాల్గొన్నారు. మారీసుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్ముడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం గాంధీ, నెహ్రూచేసిన త్యాగాలను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఆరాధనోత్సవం

తెనాలి, మారీసుపేట జనవరి 30: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ 76వ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, కస్తుర్బా విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలను, పూజలను ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామాలింగాచారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంకోసం గాంధీజీ చేసిన త్యాగాలను, సేవలను మరువలేమన్నారు. వారుచూపిన బాటలో మనమందరమూ అహింస ద్వారా ఎంతటి విజయాన్నై సాధించవచ్చు అని అన్నారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రామాలింగాచారి తదితరులు

యార్డును సందర్శించిన అధికారుల బృందం

● కోల్డ్‌స్టోరేజి ప్రమాదంపై విచారణ
● బాధిత రైతులు, రైతు సంఘాల నాయకులతో సమావేశం
● నష్టం పరిహారంపై ఉన్నతాధికారులకు నివేదికలు

దుగ్గిరాల, జనవరి 30: దుగ్గిరాలలోని శుభం కోల్డ్‌స్టోరేజిలో అగ్ని ప్రమాదం, పంట నష్టంపై సబ్‌కలెక్టర్ ప్రభాకర్‌జైన్ బృందం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రమాదం జరిగి 11రోజులైనప్పటికీ బాధిత రైతులకు ఎలాంటి హామీ లభించని నేపథ్యంలో సబ్‌కలెక్టర్ ప్రభాకర్‌జైన్ బృందం పర్యటన రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. రికార్డులు బయటపెట్టక పోవడంతో సుమారు 1200మంది రైతులకు చెందిన లక్షా16వేల బస్తాల పసుపు నిల్వలున్నాయని, నష్టం రూ.50కోట్లని, రూ.120కోట్లని ఇతమిద్ధంగా తేల్చిచెప్పని పరిస్థితి. వివిధ పార్టీలు, రైతు సంఘాల నాయకులు బాధిత రైతులను పరామర్శించి న్యాయం జరిగేవరకూ అండగా ఉంటామని, ఎలాంటి హామీ లభించకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ప్రకటించారు. కాగా మంగళవారం ఉదయం కోల్డ్‌స్టోరేజికి వచ్చిన అధికారుల బృందం వివిధ కోణాల్లో విచారణ చేపట్టింది. అనంతరం స్థానిక పసుపు యార్డులోని చైర్మన్ చాంబర్‌లో బాధిత రైతులు, వివిధ పార్టీలకు చెందిన రైతు సంఘాల నాయకులతోనూ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ ప్రభాకర్ జైన్ మాట్లాడుతూ రైతుల నుంచి వినతిపత్రాలు ఇచ్చారని, బీమా కంపెనీలతో మాట్లాడాల్సి ఉందని, ఉన్నతాధికారులకు వివరిస్తామని, వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు అహర్నిశలు శ్రమించి పండించిన పంట అగ్నికి ఆహుతైందని, విచారణ జరపాలని, పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సోమవారంలోగా నిర్దిష్టమైన హామీ లభించకుంటే. బాధిత రైతులతో కలిసి ధర్నాకు చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో పసుపురైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్, తెలుగు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కల్లం రాజశేఖరరెడ్డి, జిల్లా ప్రకృతి విపత్తుల యాజమాన్యం, అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖాధికారి బీ రవీంద్రబాబు, వివిధ రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో ప్రమాదం జరిగిన కోల్డ్‌స్టోరేజిలో అధికారులతో కలిసి రైతుల పత్రాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రభాకర్‌జైన్, అధికారుల బృందం



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

చిత్రలేఖనం పోటీల్లో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు, జనవరి 30: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో నారాకోడూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులను గుంటూరులో ప్రదానం చేశారు. ఎం.లిడియా, ఎంఎస్ తులసీ, షేక్ నజమాకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. అలాగే నజమాకు రూ.3వేల నగదు బహుమతి, లిడియాకు రూ.2వేలు, వ్యాస రచన పోటీలలో ప్రతిభ చూపిన ఎం.నాగతులసికి రూ.2వేల నగదు బహుమతిని, మెమంటోలను అందించారు. కార్యక్రమంలో జేసీ రాజకుమారి, డీఈవో శైలజ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

రైతులు పంటలను ప్రతిరోజు పరిశీలించుకోవాలి

● జిల్లా అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ ప్రసాద్

కొల్లిపర, జనవరి 30: రైతులు రబీలో వేసిన మొక్కజొన్న, జొన్న పంటలను ప్రతిరోజు పరిశీలించుకోవాలని జిల్లా అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోట, చివలూరు, కొల్లిపర, దావులూరు, తూములూరు గ్రామాల్లో వేసిన మొక్కజొన్న, జొన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. తెగుళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్నలో అక్కడక్కడ కత్తెర, కాండం తొలుచు పురుగు కనిపిస్తుందని రైతులు వ్యవసాయాధికారుల సూచనలు మేరకు నివారించుకోవాలన్నారు. అనంతరం తూములూరులో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటుచేసిన రైతు సదస్సులో వ్యవసాయాధికారులు పాల్గొని రైతులకు వివిధ రకాల పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డీడీఏ పి. రామాంజనేయులు, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషారాణి, ఏవో వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ తొలుచు పురుగు నివారణకు చర్యలు చేపట్టండి: ఏవో

తెనాలి రూరల్, జనవరి 30: మొక్కజొన్నలో గులాబిరంగు మొవ్వ తొలుచు పురుగు ఆశించి పంటలను నష్టపరుస్తుందని వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో ప్రేమసాగర్ తెలిపారు. మొక్కజొన్న విత్తనం నాటిన 10 లేదా 12 రోజులకు విధిగా ఎకరానికి 500 మి.లి క్లోరిఫైరిఫాస్ లేదా 60 మి.లి ట్రేసరు లేదా 100 మి.లి డెలిగేట్ లేదా 40 మి.లీ లేదా 80 గ్రాములు ప్రోక్లెమ్‌ను అవసరాన్ని బట్టి 7 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా 2 కిలోల కార్బ్రాన్ 3జి గుళికలను మొవ్వలలో వేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

తెనాలి, మారీసుపేట జనవరి 30: స్థానిక సాలిపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం వైసీపీ నాయకుడు కాళిదాసు వెంకటేశ్వరావు కుమారుడు అజయ్ పృథ్వీ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మద్దాళి శేషాచలం, మన్నవ ప్రభాకర్, భాస్కరుని శ్రీనివాసరావు, గురునాథగుప్తా, డాకా అంకిరెడ్డి, ఎస్ఆర్కే శర్మ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

తెనాలి, మారీసుపేట జనవరి 30: మండల పరిదిలోని కఠెవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ అసిస్టెంటు (సోషల్)గా పనిచేస్తు దావులూరి విజయ బుధవారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా పాఠశాలకు ఐరన్ బీరువాను ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌కు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె అంకితభావంతో నిబద్ధతో పనిచేసేవారన్నారు. సుమారు రూ.10 వేలు విలువచేసే బీరువాను అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకే సిగ్నల్స్ ఏర్పాటు

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, జనవరి 30: పెరిగిపోయిన వాహనాలతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో తెనాలి వచ్చే వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. మంగళవారం పట్టణంలోని కబేళా వంతెన ప్రాంతంలో, సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్ పోల్స్, ఇతర పనులను ఎమ్మెల్యే శివకుమార్ ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తెనాలి ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ సమస్యలనుంచి ఊరటకలిగించేలా కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ సహకారంతో సిగ్నల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అందుకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని త్వరలోనే ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి ఊరట కలగనుందని ఆయన స్పష్టం చేశారు. సునీల్, నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ అధికారులు సుధాకర్, సుబ్బారావు, టౌన్ ప్లానింగ్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి క్రైం, జనవరి 30: కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయసేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి కె.పి.బాలాజీ తెలిపారు. వీరు కోర్టులు, కక్షిదారుల మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి ఉండాలన్నారు. వీరికి చట్టాలు, న్యాయ వ్యవస్థపై శిక్షణ జరుగుతుందని, సామాజిక సేవాభావంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు, లా విద్యార్థులు, వైద్యులు, సీనియర్ సిటిజన్లు, ఇతర అర్హులైన అభ్యర్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 6వ తేదీ లోపు న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందించాలన్నారు.

జేఎంజేలో క్యాంపస్ డ్రైవ్

తెనాలి, మారీసుపేట జనవరి 30: స్థానిక చెంచుపేటలోని జేఎంజే మహిళా కళాశాలలో మంగళవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ల్యాంగ్వేజ్ మానేజ్‌మెంటు (ఐఎల్ఎం) బెంగుళూర్ వారు మూడో సంవత్సరం డిగ్రీని చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. విద్యార్థులకు మూడు దశలలో 166మందికి పరీక్షలను నిర్వహించిగా వారిలో 24మంది ఎంపిక అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాంటెండు డాక్టర్ సిస్టర్ థెరీస్సమ్మ పాల్గొని క్యాంపస్ డ్రైవ్‌లో ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐఎల్ఎం సభ్యుడు రోనిలా కార్లో (అకడమిక్ డైరెక్టర్), పాషా (ఎచ్ఆర్), మీరాబి, ట్రైనింగ్, ప్లేస్‌మెంటు ఆఫీసర్ డాక్టర్ జి సుధాకరయ్య, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవిడ్ అమర వైద్యులకు ఘన నివాళి

తెనాలి, మారీసుపేట జనవరి 30: స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ హాల్‌లో మంగళవారం దేశవ్యాప్తంగా కొవిడ్ మహమ్మారికి వ్యతిరేకంగా పోరాట సేవలో అసువులు బాసిన వైద్యులను సంస్మరిస్తు కొవిడ్ అమర వైద్యుల దినంను నిర్వహించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి ముందుగా కొవిడ్ వైద్యం పట్టణ ప్రజలకు అందిస్తు మృతిచెందిన వైద్యులు ప్రేమ్‌కుమార్, లవకుశులు, రాంబాబుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలో కొవొత్తుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు కె శ్యాంప్రసాద్, మధుభాస్కర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాంబాబు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

తెనాలి, మారీసుపేట జనవరి 30: పట్టణంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగాయి. కార్యక్రమంలో ఐటీడీపీ సభ్యుడు ఎం.వెంకట్, ఎస్. సాంబశివరావు, జి.రమేష్, ఎం. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసాచారికి నరేంద్ర నివాళి

పొన్నూరు టౌన్, జనవరి 30: పట్టణంలోని నిడుబ్రోలు 10వ వార్డుకు చెందిన పడమదురు శ్రీనివాసాచారి మంగళవారం మృతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న నరేంద్రకుమార్ మంగళవారం శ్రీనివాసాచారి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసాచారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.



శ్రీనివాసాచారి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నరేంద్ర కుమార్

రేపు జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

పొన్నూరు టౌన్, జనవరి 30: సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 1న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలన్ని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్ కోరారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1వ తేదీన కలెక్టరేట్ వద్ద మున్సిపల్, విద్యారంగ సమస్యలపై ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు, ఎం.వెంకటేశ్వర్లు, జి.శివరామకృష్ణ, మేకా శ్రీనివాసరావు, నరసింహారావు, బాలకృష్ణ, నూరుద్దీన్, ఏ శ్రీనివాసరావు, షేక్ బద్రూద్దీన్, షేక్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్ళను విమర్శించే అర్హత ఎమ్మెల్యే కిలారికి లేదు

● చేబ్రోలు మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరామరాజు

చేబ్రోలు, జనవరి 30: ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను కానీ, సంగం డెయిరీని కానీ విమర్శించే అర్హత ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు లేదని చేబ్రోలు మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు అన్నారు. చేబ్రోలు టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రామరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలారి అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. సంగం డెయిరీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న రోశయ్య కానీ, వైసీపీ ప్రభుత్వం కానీ ఎందుకు నిరూపించలేకపోయిందని నిలదీశారు. చేబ్రోలు మండలంలో ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి పని అయినా చేశారా అని నిలదీశారు. సోషల్ మీడియాలో పబ్లిసిటీ తప్ప అభివృద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తుందని వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి దోషులను శిక్షిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఇర్ఫాన్, బండ్లమూడి జ్యోతికుమార్, అనంత లక్ష్మీనారాయణ, బసవ శివశంకరరావు, తాటి శంకర్, వెంకట్రావు, నూరగాని గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోశయ్యవి అసత్య ఆరోపణలు

పెదకాకాని, జనవరి 30: తెలుగుదేశం పార్టీ చేపట్టిన రా.. కదలిరా కార్యక్రమం విజయవంతం కావడంతో పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్య అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం మండల పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో అక్రమాలకు అడ్డాగా కిలారి రోశయ్య మారారన్నారు. దోచుకో.... దాచుకో అన్న సిద్ధాంతంలో ఆయన పని చేస్తున్నారని.... నియోజకవర్గ అభివృద్ధిని వదిలేసి అనేక అక్రమాలకు.... అన్యాయాలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గంలో అభివృద్ధిని వదిలేసి అరాచకాలకు... అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టీడీపీ చేపట్టిన బహిరంగ సభ విజయవంతం కావడం, వైసీపీ నాయకుల గుండెల్లో రైలు పరిగెత్తున్నాయన్నారు. వైసీపీ నాయకులు అన్యాయాలను నిలుపుదల చేయకపోతే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుక్కల మల్లికార్జునరావు, మండల కార్యదర్శి తాళ్ల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు రాజేష్, బుల్లా మోజేష్, ఎంపీటీసీ సభ్యులు మోపర్తి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బూసి బాబు, శివాలయం మాజీ చైర్మన్ కాజా అంకమ్మరావు, దర్శి భాస్కరరావు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌కు వీల్ చైర్ వితరణ

తెనాలి అర్బన్, జనవరి 30: ప్రయాణికుల సౌకర్యం కోసం రైల్వే స్టేషన్‌కు మంగళశారం వీల్‌చైర్ అందజేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయశంకర్, రామమోహనరావు, సుబ్రహ్మణ్యం, కనకరత్నం తదితరులు సూపరింటెండెంట్ వెంకటరమణకు వీల్‌చైర్ అందించారు.